సాక్షి
కుమురం భీం

గురువారం ı 16 ı మే ı 2024



పరిశుభ్రతే మహాభాగ్యం
ఎడిస్ ఈజిప్ట్ దోమ డెంగీని వ్యాపింపజేస్తుంది. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో ▸



అల్లాడుతున్న మూగజీవాలు
వేసవిలో మూగజీవాలు గ్రాసం కోసం అల్లాడుతున్నాయి. ఎండు గడ్డి, ఆకులు తిని పొట్ట నింపుకుంటున్నాయి. రైతులు వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.1 /27.9

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గినా ఎండ తీవ్రత కొనసాగుతుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సదయ్య బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సీఆర్‌పీసీ 144 సెక్షన్, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇతరులను రెచ్చగొట్టే ప్రయత్నాలు, ప్రకటనలు చేసినా చర్యలు తప్పవన్నారు. జైనూర్ మండల పరిధిలోని పోలీసులను మోహరించామని, బుధవారం కూడా దుకాణాలు తెరవకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మండల కేంద్రానికి ఇతర గ్రామాల వారు రాకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. వ్యక్తిగత కక్షలను ఆసరాగా తీసుకుని లబ్ధి పొందాలనే ఉద్దేశంతో రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ఘటనల ఫొటోలు, వీడియోలు కూడా ప్రచారం చేయడం చట్టవ్యతిరేకమన్నారు. ప్రజలు శాంతిభద్రతల రక్షణకు సహకరించాలని కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రశంసాపత్రం అందిస్తున్న డీఈవో అశోక్

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌లో బుధవారం విద్యార్థులకు రసాయన శాస్త్రం బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్ట్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. పదో తరగతి తర్వాత విద్యార్థులకు వినూత్నమైన విద్యావకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు కష్టపడి చదివాలని సూచించారు. నచ్చిన కోర్సు తీసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మధుకర్, ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ, మోహన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు నేడే లాస్ట్
ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజును అపరాధ రుసుంతో గురువారం లోగా చెల్లించాలని డీఐఈవో శంకర్ తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 16లోగా చెల్లించాలని సూచించారు. ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భద్రత భేష్..!



కాగజ్‌నగర్ పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

- జిల్లాలో ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ
- సత్ఫలితాలు ఇచ్చిన పోలీసుశాఖ ముందస్తు చర్యలు
- పెద్ద మొత్తంలో నగదు, మద్యం, గంజాయి సీజ్
- సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనూ ప్రశాంతంగా పోలింగ్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కౌటాల(సిర్పూర్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులుగా ఉండటం, గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాను ఎన్నికల సంఘం మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా గుర్తించింది. ఎండల దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగినా జిల్లాలో మాత్రం 4 గంటల వరకే గడువు ఇచ్చారు. జిల్లా యంత్రాంగం కృషితో జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పార్లమెంట్ ఎన్నికల క్రతువు విజయవంతంగా ముగిసింది. పటిష్టమైన భద్రత కల్పించడంతో పోలీసుశాఖ సక్సెస్ అయ్యింది.

ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో..
జిల్లాలో గత అనుభవాల దృష్ట్యా పోలీసు శాఖ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ఎన్నికల సంఘం గుర్తించిన విషయం తెలిసిందే. అలాగే అనేక ప్రాంతాలకు సరైన రోడ్డు మార్గాలు లేకపోవడం, సిగ్నల్ సమస్యలు ఉండటంతో అనేక పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్నాయి. ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎస్పీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు, ప్రత్యేక బలగాలు బందోబస్తు నిర్వహించాయి. రెండు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో దాదాపు రెండు వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, సీఐలు, 15 మంది ఎస్సైలు, 30కి మందికి పైగా ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు భద్రతలో పాలుపంచుకున్నారు. వీరితోపాటు 33 సీఆర్‌ఎస్ సెక్షన్లు, 295 ట్రెనింగ్ పీసీఎస్, టీఎస్ఎస్‌పీ 15 సెక్షన్లు, మరోవైపు కేంద్ర బలగాలు సైతం పోలింగ్ రోజు ఆయా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుతోపాటు ముగ్గురి నుంచి ఐదుగురి వరకు మోహరించారు. ఓటర్లకు ముందస్తుగానే చైతన్యవంతం చేయడంతో కొన్ని బూత్‌ల్లో ఒక్కరే విధుల్లో ఉన్న సమస్యలు ఉత్పన్నం కాలేదు. జిల్లాల అగ్రనేతల పర్యటన సమయంలోనూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

ప్రజలకు భరోసా.. బలగాలతో కవాతు
ఎన్నికల్లో ఓటర్లకు భరోసా కల్పించేందుకు మండల కేంద్రాలు, పట్టణాలతోపాటు మారుమూల గ్రామాల్లో సైతం కేంద్ర బలగాలతో కలిసి 23 ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించారు. కవాతు నిర్వహిస్తూ నిర్భయంగా ఓటు వేయాలని అవగాహన కల్పించారు. సోషల్ మీడియా పోస్టులు, వాట్సాప్ గ్రూపులపై ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు, శాంతి భద్రతలకు భంగం కలిగించే పోస్టులను మానిటరింగ్ చేసేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. మావోయిస్టు, సమస్యాత్మక కేంద్రాలకు జిల్లా కేంద్రం వేగంగా చేరుకునేందుకు రూట్ మ్యాప్‌లు సిద్ధం చేసుకున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పోలీస్ పరిశీలకులు రాజీవ్‌కుమార్ సక్సేనా సైతం పోలింగ్ రోజు పోలీస్ బందోబస్తును పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతం
- ఎస్పీ సురేశ్‌కుమార్



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పోలీసులు, ప్రజలతోపాటు అందరి సహకారంతో ఎన్నికల నిర్వహణ విజయవంతమైందని ఎస్పీ సురేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు రెండు వేల మంది పోలీసు సిబ్బందితో విధులు నిర్వర్తించామని పేర్కొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయడంతోపాటు మారుమూల పల్లెల్లోనూ కేంద్ర బలగాలతో కవాతులు చేసి ప్రజలకు ఓటు ప్రాముఖ్యతను వివరించామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. పోలీసుల పనితీరును ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

అక్రమాలకు 'చెక్'.. పాత నేరస్తుల బైండోవర్
పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి పోలీసు శాఖ అక్రమ రవాణాపై నిఘా పెంచింది. అక్రమ రవాణాను అడ్డుకుంటూనే.. మరోవైపు పాత నేరస్తులపై దృష్టి సారించింది. తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దుల్లో మార్గాల్లో అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మరోవైపు ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర పోలీస్ అధికారులతోనూ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో మొత్తం ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత చెక్‌పోస్టుల్లో అత్యధికంగా 182 కేసుల్లో రూ.2.04 కోట్లు పట్టుకుని రాష్ట్రంలోనే జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచింది. వీటితోపాటు రూ.6,54,878 విలువైన 1,315 లీటర్ల లిక్కర్ బాటిళ్లు, రూ.2,40,140 విలువైన 9.588 కేజీల గంజాయి, 14 గంజాయి మొక్కలు పట్టుకున్నారు. రూ.1.75 లక్షల విలువైన 17 మిక్సర్లు, 43 కూలర్లు సీజ్ చేశారు. నేర చరిత్ర కలిగిన వారిని ముందుగానే బైండోవర్ చేశారు. 311 కేసుల్లో గత ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన వారు ఉండగా, పాత నేరస్తులు 717 మందిని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బైండోవర్ చేశారు. 15 మంది వద్ద ఉన్న లైసెన్స్‌డ్ ఆయుధాలను సీజ్ చేశారు.

గోదాంకు రిజర్వ్ ఈవీఎంల తరలింపు
- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



గోదాం వద్ద కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: భారీ బందోబస్తు మధ్య రిజర్వ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోదాంకు తరలించినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పట్టణంలోని పీటీజీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామన్నారు. అలాగే సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిట్ స్కూల్‌లోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచామని పేర్కొన్నారు. ఆయా చోట్ల నుంచి రిజర్వ్ ఈవీఎంలను బందోబస్తు మధ్య జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల గోదాంకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎం గోదాం వద్ద సీసీ కెమెరాల నిరంతరం పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

20న ఆలయ భూముల 'కౌలు' వేలం
ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీకేశవనాథస్వామి ఆలయ భూములను సంవత్సరం పాటు కౌలు కోసం ఈ నెల 20న ఉదయం 11 గంటలకు బ్రాహ్మణవాడ కేశవనాథస్వామి ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ ఈవో వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ ఫొటోతోపాటు ధరావత్తు సొమ్ము రూ.50 వేల నగదు ముందుగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం ముగిసిన వెంటనే నగదును ఆలయానికి చెల్లించి రశీదు తీసుకోవాలని సూచించారు. రూ.100 నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్‌పై అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు.

చెస్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణను ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన(ఆసిఫాబాద్): వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చెస్ శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సంపత్‌కుమార్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో చెస్ కోచింగ్ క్యాంపును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా నచ్చిన క్రీడలో పట్టు సాధించేందుకు వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పలు రకాల క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. చెస్‌ను క్రీడాకారులకు చేరువ చేయాలనే సంకల్పంతో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెల రోజుల పాటు కొనసాగే శిక్షణను క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెస్ క్రీడ మెదడుకు మేత లాంటిదని, దీని ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాజు శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కల్పన, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు గ్రామాల బాట

- కేజీబీవీల్లో ప్రవేశాలకు జూన్ 12 వరకు సర్వే
- అర్హుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది
- ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 15 కస్తూరిబా విద్యాలయాలు

కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థుల కోసం సిబ్బంది గ్రామాల బాట పట్టారు. ఈ నెల 1 నుంచి జూన్ 12 వరకు పల్లెల్లో తిరుగుతూ సర్వే నిర్వహించనున్నారు. కేజీబీవీలు మెరుగైన ఫలితాలు సాధిస్తుండటంతో అడ్మిషన్లకు డిమాండ్ పెరిగింది.



లింగాపూర్ మండల కేంద్రంలో సర్వే చేస్తున్న టీచర్

కెరమెరి(ఆసిఫాబాద్): అనాథలు, పేదరికంతో చదువు దూరమవుతున్న బాలికలకు వసతితో కూడిన ఉన్నత విద్యనందించేందుకు ప్రభుత్వం కస్తూరిబా గాంధీ విద్యాలయాలను ప్రారంభించింది. త్వరలో 2024– 25 విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో సిబ్బంది ప్రవేశాల ప్రక్రియ మొదలుపెట్టారు. కేజీబీవీల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులు, సంరక్షకులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 15 కస్తూరిబా విద్యాలయాలు ఉన్నాయి. ఇందులో 6 నుంచి పదో తరగతి వరకు 3,200 మంది చదువుతున్నారు. అలాగే 12 కేజీబీవీల్లో ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా చోట్ల ఎంపీసీ, బైపీసీ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఒక్కో కేజీబీవీలో 320 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ లెక్కన ఇంటర్ ఫస్టియర్‌లో 3840 మంది విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆరో తరగతి విద్యార్థినుల కోసం కేజీబీవీల సిబ్బంది గ్రామాల్లో ఈ నెల 1 నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. విద్యాలయంలో వసతి, బోధన తీరు గురించి వివరిస్తున్నారు. అనాథలు, పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ సర్వే జూన్ 12 వరకు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.



మోడి గ్రామంలోని కేజీబీవీ

మెరుగైన ఉత్తీర్ణత
ఇటీవల విడుదలైన పది, ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు జిల్లాలో 505 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 474 మంది పాసయ్యారు. రికార్డు స్థాయిలో 93.86 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ) కస్తూరిబా విద్యాలయాలు వంద శాతం ఫలితాలతో ముందంజలో నిలిచాయి. మిగితా చోట్ల కూడా ఫలితాలు 85 శాతానికి తగ్గలేదు. అలాగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు 566 మంది హాజరు కాగా.. 467 మంది ఉత్తీర్ణులు కాగా.. 82.51 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్ పరీక్షలకు 469 మంది హాజరు కాగా 380 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేజీబీవీలు ప్రథమ సంవత్సరంలో మూడోస్థానంలో నిలవగా.. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఐదో స్థానంలో నిలిచాయి. పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ఆదర్శంగా నిలిచారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం, వసతి సదుపాయం కల్పిస్తున్నారు. పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు ప్రతీ వారం చికెన్, కోడిగుడ్డుతోపాటు అల్పాహారం, కందిపప్పుతో కూడిన భోజనం అందిస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం



జిల్లాలోని కస్తూరిబా విద్యాలయాల్లో సీట్ల భర్తీ కోసం ఉపాధ్యాయులు సర్వే చేస్తున్నారు. అర్హులైన విద్యార్థుల వద్ద నుంచి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మొదట బడి బయట, బడి మానేసిన, తల్లిదండ్రులు ఇద్దరూ లేని, సింగిల్ పేరెంట్ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తాం. కేజీబీవీ ఉన్న ప్రాంతం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఇతర ఉన్నత పాఠశాల లేని వారికి కూడా సీట్లు కేటాయిస్తాం. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు, భోజన వసతి ఉంటుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రాథోడ్ సుభాష్, సెక్టోరల్ అధికారి

అక్కడ తునికాకు సేకరణ లేనట్లే!



తునికాకు కల్లాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- అడ, ధబోలి యూనిట్లలో రెండేళ్లుగా నిలిపివేత
- గిరివెల్లి–ఏ, కడంబా, బొంబాయిగూడ యూనిట్లలోనూ ప్రారంభం కాని వైనం
- ఉపాధికి దూరమవుతున్న కూలీలు

కెరమెరి(ఆసిఫాబాద్): వేసవిలో ఉపాధిని కల్పించే తునికాకు సేకరణ వేసవి పంటగా పేరుగాంచింది. అయితే అధికారుల నిర్లక్ష్యమో.. గుత్తేదారుల అలసత్వమో గానీ రెండేళ్లుగా ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని అడ, ధబోలి యూనిట్ల పరిధిలో తునికాకు సేకరణకు టెండర్లు పిలవడం లేదు. ఫలితంగా ఆయా యూనిట్ల పరిధిలోని కెరమెరి, ఆసిఫాబాద్, జైనూర్ మండలాల ప్రజలు తునికాకు సేకరణకు దూరమవుతున్నారు. వేసవిలో ఆర్థిక భరోసానిచ్చే ఉపాధి లభించక కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..
జిల్లాలో తునికాకు సేకరణ కోసం ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ అధికారులు మొత్తం 15 యూనిట్లు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో ఒక యూనిట్, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 11 యూనిట్ల ద్వారా ఆకు సేకరణ చేపట్టారు. టెండర్లు రాని కారణంగా గిరివెల్లి–ఏ, కడంబా, బొంబాయిగూడ యూనిట్లలో ఆకు సేకరణ ప్రారంభం కాలేదు. అయితే అడ యూనిట్ పరిధిలో ఆసిఫాబాద్ కెరమెరి మండలాలు, ధబోలి యూనిట్ పరిధిలో జైనూర్ మండలాలు ఉన్నాయి. ఇక్కడ 2022 వరకు తునికాకు సేకరణ ప్రక్రియ సజావుగా సాగింది. ఈ రెండు యూనిట్లలో దాదాపు 41 కల్లాలు ఏర్పాటు చేసేవారు. గత రికార్డుల ప్రకారం 5,234 మంది కూలీలు తునికాకు సేకరణతో ఉపాధి పొందేవారు. అనివార్య కారణాలతో 2023 నుంచి తునికాకు సేకరణను నిలిపివేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ప్రకటించారు. ఒక్కో యూనిట్ టార్గెట్ 10 లక్షల కట్టలుగా నిర్దేశించారు. ఏటా 5 నుంచి 7 లక్షల వరకు లక్ష్యం సాధిస్తూ వచ్చారు. గతేడాది నుంచి ఆకు నాణ్యత సరిగ్గా లేదని టెండర్లు వేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వం సైతం టెండర్లు పిలవడం లేదు. ప్రస్తుతం కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో తునికాకు సేకరణ కొనసాగుతోంది. ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్ మండలాల కూలీలు కల్లాల ఏర్పాటు గురించి ఫారెస్ట్ అధికారుల వద్ద ఆరా తీస్తున్నారు. మరోవైపు 2017 నుంచి తునికాకు కట్టల బోనస్ కూడా పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు. వచ్చే ఏడాది నుంచైనా తునికాకు సేకరణ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుని, రాయల్టీ చెక్కులు అందించాలని వారు కోరుతున్నారు.


ఆర్థికంగా నష్టం



రెండేళ్లుగా మా గ్రామంలో తునికాకు కల్లాలు ఏర్పాటు చేయడం లేదు. ఏటా కుటుంబం మొత్తం అడవులకు వెళ్తే కనీసం రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు సంపాదించేవాళ్లం. తునికాకు సేకరణ నిలిచిపోవడంతో వేసవిలో పని లేకుండా పోయింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా లేక ఇళ్ల వద్ద ఖాళీగా ఉంటుంది. కనీసం బోనస్ డబ్బులైనా చెల్లించాలి.

– మహూరే నాగాబాయి, అంతాపూర్, మం.కెరమెరి

రెండేళ్లుగా బంద్



ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో నాణ్యమైన తునికాకు లభించకపోవడంతో అడ, ధబోలి యూనిట్ల పరిధిలో లక్ష్యం చేరుకోవడం లేదు. నాణ్యత లేని ఆకుల కారణంగా కాంట్రాక్టర్లు అనాసక్తి చూపుతున్నారు. ఫలితంగా రెండేళ్ల నుంచి టెండర్లు కూడా పిలవడం లేదు.

– నాగేశ్వర్‌గౌడ్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో, కెరమెరి

నేటి నుంచి సమ్మర్ క్యాంప్
ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లోని గిరిజన క్రీడా ఆదర్శ పాఠశాలలో ఈ నెల 16 నుంచి 31 వరకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023– 24 సంవత్సరానికి సంబంధించి మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన బాలబాలికలను ఈ క్యాంపునకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. 60 మంది బాలురు, 60 మంది బాలికలకు ఈ నెల 31 వరకు అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఒకరి మృతికి కారకులైన ఇద్దరికి జైలుశిక్ష

భీమిని: కన్నెపెల్లి మండలంలోని లింగాల గ్రామ పంచాయతీకి చెందిన చౌదరి వెంకన్న మృతికి కారకులైన ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మంచిర్యాల కోర్టు జడ్జి తీర్పునిచ్చినట్లు కన్నెపెల్లి ఎస్సై గంగారం తెలిపారు. లింగాల గ్రామానికి చెందిన చౌదరి వెంకన్న భార్య లక్ష్మి దన్నూరి రాజుతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో మనస్తాపానికి గురైన వెంకన్న 25 మార్చి 2019లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు చౌదరి మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్‌మోహన్, కోర్టు కానిస్టేబుల్ గట్టయ్య నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో చౌదరి లక్ష్మికి ఐదేళ్లు, దన్నూరి రాజుకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు ఇరువురికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నెన్నెల: జెండా వెంకటాపూర్ గ్రామంలోని ఎస్కోరి కృష్ణవేణికి చెందిన కిరాణం షాపులో చోరీకి పాల్పడిన అదే గ్రామానికి చెందిన దూట శశికాంత్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 2న రాత్రి దుకాణం తలుపులు గడ్డపారతో పగులగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు దొంగిలించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆధారాలు సేకరించామన్నారు. వేలిముద్రల ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుని వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

పిడుగు పడి మహిళకు గాయాలు

రెబ్బెన: మండలంలోని కొండపల్లిలో బుధవారం సాయంత్రం ఇంటి ముందు పనిచేస్తున్న మహిళపై పిడుగుపడడంతో గాయాలయ్యాయి. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లికి చెందిన సోన్లే యమునాబాయి తమ ఇంటి ముందు ఉన్న బావి వద్ద పనులు చేసుకుంటోంది. ఈ క్రమంలో ఒక్కసారిగా కురిసిన వర్షానికి పిడుగుపడడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవే టు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సింగరేణి రిటైర్డు కార్మికుడు ఆత్మహత్య

మందమర్రిరూరల్: ఉరేసుకుని సింగరేణి రిటైర్డు కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సల్లూరి బానయ్య (59) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడి భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురైన బానయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిశుభ్రతే మహాభాగ్యం

- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- దోమల నివారణతోనే విషజ్వరాల వ్యాప్తి అంతం
- నేడు డెంగీ నివారణ దినోత్సవం

మంచిర్యాల జిల్లాలో చేసిన డెంగీ పరీక్షలు, నమోదైన కేసులు

సంవత్సరం	పరీక్షలు	డెంగీ కేసులు
2020	522	32
2021	2046	118
2022	2502	116
2023	1350	74
2024	20	1



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో నిల్వ నీరు



డెంగీపై అవగాహన కరపత్రం

మంచిర్యాలటౌన్/కౌటాల: 'ఆరోగ్యమే మహాభాగ్యం'అన్న నానుడి నిజం కావాలంటే... ముందుగా మన చుట్టూ ఉన్న పరిసరాలతో పాటు మన ఇంటినీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు వైద్యులు. వ్యక్తిగత శుభ్రతతో పాటు జీవించే ఇల్లు, ఆవరణ, చుట్టూ ఉన్న ప్రదేశం ఎంత పరిశుభ్రంగా ఉంటే అంత మంచిదని, అప్పుడే డెంగీ దోమలు వృద్ధి చెందకుండా, ప్రాణాలు తీసే జ్వరాల బారిన పడకుండా రక్షించబడతారు. డెంగీ పేరు వింటేనే జనానికి దడపుడుతోంది. వర్షాకాలం మొదలైందంటే సీజనల్ వ్యాధులతో పాటు, డెంగీ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాల్లో కొబ్బరి బోండాలు, వాహనాల పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లు, నీటి తొట్టెలు, పూలకుండీలలో నీరు నిల్వ ఉంటే అందులో ఎడిస్ ఈజిప్ట్ అనే డెంగీ దోమ వృద్ధి చెందుతుంది. పగటి పూట కుట్టే ఈ దోమ వల్లనే డెంగీ జ్వరం వస్తుంది. ఈ దోమను టైగర్ దోమ అని కూడా పిలుస్తారు.

డెంగీ లక్షణాలు

- ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ కుట్టిన తరువాత నాలుగు నుంచి పదిరోజుల మధ్య డెంగీ లక్షణాలు బయటపడతాయి.
- తీవ్రమైన జ్వరంతో ఈ వ్యాధి మొదలవుతుంది.
- కళ్లు కదిలించలేని పరిస్థితి ఉంటుంది.
- ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు వస్తాయి.
- వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన ప్రధాన లక్షణం
- ఈ లక్షణాలు నాలుగు నుంచి ఆరు రోజులు కొనసాగుతాయి.
- డెంగీ లక్షణాలు ఉంటే బీపీ పడిపోతుంది. రక్త కణాలు తగ్గుతాయి. ఇవన్నీ ఐదు నుంచి ఏడు రోజుల మధ్య జరుగుతాయి.
- మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మాత్రమే దీని నిర్ధారణ పరీక్ష అందుబాటులో ఉంది.

చికిత్స

- వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధులకు పూర్తి చికిత్స లేదు.
- లక్షణాలను బట్టి వైద్యులతో ఉపశమన చర్యలు చేపట్టాలి.
- డెంగీ వ్యాధికి వైద్యం ఆలస్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది.
- రక్త నమూనాలను పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేయాలి.

దోమల నివారణ ఇలా..

- దోమ తెరలు వాడటం, ఇంటికి కిటికీలకు, తలుపులకు జాలీలను బిగించడం.
- ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించడం.
- నీటి తొట్టెలను వారం రోజులకోసారి ఖాళీ చేసి శుభ్రం చేయడం.
- తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- కూలర్లు, ఫ్లవర్‌వాజ్, పూలకుండీలలో నీటిని తరచూ మార్చాలి.
- నీటి నిల్వలో దోమలు వృద్ధి చెందకుండా టిమిసాస్ మందు స్ప్రే చేయాలి.

ఇది ఒకరి నుంచి మరొకరికి ఏడిస్ ఈజిప్ట్ దోమ కాటు ద్వారా డెంగీ వ్యాపిస్తుంది. జ్వరం, హేమరేజ్, షాక్ సిండ్రోమ్ అనే మూడు దశల్లో డెంగీ తీవ్రత ఉంటుంది. ఏమాత్రం అశ్రద్ధ చేసినా ప్రాణాలకు ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కేవలం రాపిడ్ డయాగ్నోస్టిక్స్ కిట్‌ల ద్వారా మాత్రమే డెంగీ లక్షణాలను గుర్తిస్తారు. పూర్తిగా నిర్ధారణ చేసేందుకు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో, టీహబ్‌లో ఎలిజా టెస్టు చేసేందుకు అవకాశం ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కేవలం డెంగీ కిట్‌లతో పరీక్షించి రక్తకణాలు తగ్గుతున్నాయంటూ, డెంగీ వైద్యం పేరిట లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారు. రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండి చికిత్సకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకోవడం కంటే, నిరంతరం ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు, పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



నిల్వ నీటిలో దోమల మందు చల్లుతున్న వైద్య సిబ్బంది(ఫైల్)

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



గతేడాది ఎక్కడ డెంగీ కేసులు నమోదయ్యాయో అక్కడ మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. ముల్కల్ల, దేవాపూర్, మంచిర్యాల మున్సిపాలిటీల్లో ఎక్కువగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రతి బుధ, శనివారాల్లో అన్ని పీహెచ్‌సీలలో డెంగీ వ్యాధి గురించి వివరిస్తున్నాం. డెంగీ నిర్ధారణకు సంబంధించిన రాపిడ్ డయాగ్నోస్టిక్స్ కిట్స్‌లను అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, సబ్ సెంటర్లకు ఇచ్చాం. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, టీహబ్‌లలో డెంగీ పూర్తి నిర్ధారణ కోసం ఎలిజా టెస్టు చేస్తున్నాం.

– డాక్టర్ అనిత, మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలు, గ్రామస్థాయిలో ఆశ కార్యకర్తల సహకారంతో బృందాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ బృందాలతో యాంటీలార్వా ఆపరేషన్స్, డెంగీపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వల్ల జిల్లాలో డెంగీని సాధ్యమైనంత వరకు తగ్గించాం. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా మలేరియా అధికారి, ఆసిఫాబాద్

ప్రథమ చికిత్స కేంద్రాల్లో తనిఖీ

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పలు పీఎంపీ, ఆర్ఎంపీ ఆస్పత్రులు, ప్రథమ చికిత్స కేంద్రాల్లో తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పాలచెట్టు, మార్కెట్ ఏరియాల్లో రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారు, ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయనే విషయాలపై ఆరా తీశారు. అనుమతి లేకుండా వైద్యం అందించే పీఎంపీ, ఆర్ఎంపీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు.

నమూనా పరీక్షలకు రిజిస్ట్రేషన్

మంచిర్యాలటౌన్: టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్, యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ నమూనా పరీక్షల కోసం అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అభ్యర్థులకు నమూనా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రూప్–1 నమూనా పరీక్షలను ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3 తేదీల్లో, సివిల్ సర్వీసెస్ నమూనా పరీక్షలను హైదరాబాద్‌లో ఈ నెల 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో https:// tsbcstudycircle. cgg. gov. in/ firstpage. do వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలని, వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

దాడి చేసిన పలువురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ గోపాల్‌పై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ గోపాల్ బుధవారం దుర్గనగర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై పిట్టల్‌వాడకు వస్తుండగా 170 కాలనీకి చెందిన అజయ్ మహకాల్‌తో పాటు పలువురు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అజయ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసి చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- హాజీపూర్ మండల కేంద్రంలో ఒకరి దారుణహత్య



నరేష్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అశోక్, ఎస్సై

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వివాహేతర సంబంధం ఒకరి ప్రాణం తీసింది. అక్రమ సంబంధం కారణంగా ఒకరిని దారుణంగా హత్య చేసిన సంఘటన హాజీపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మల్యాల నరేష్ (32), నిరోషా దంపతులకు 8 నెలల కుమార్తె సంతానం. ప్రస్తుతం నిరోషా మళ్లీ గర్భం దాల్చడంతో పుట్టింటికి వెళ్లింది. నరేశ్ కొంతకాలంగా స్థానికంగా ఉన్న ఓ వివాహితతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. సదరు మహిళ సోదరుడు చైతన్యకు విషయం తెలియడంతో తీవ్రంగా మందలించాడు. అయినా పట్టించుకోకుండా అక్రమ సంబంధం కొనసాగిస్తూ వస్తున్నాడు. మంగళవారం రాత్రి నరేష్ తన సోదరితో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న చైతన్య మద్యం సేవించి నేరుగా ఇంటికి వెళ్లి నరేష్‌తో గొడవకు దిగాడు. గట్టిగా తోసేయడంతో నరేష్ కిందపడి పోగా చైతన్య పక్కనే ఉన్న బండరాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేష్ సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు చైతన్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్ తెలిపారు.

ముగిసిన బ్యాడ్మింటన్ శిక్షణ



ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ ముగింపులో పాల్గొన్న చిన్నారులు

మంచిర్యాలటౌన్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రంగంపేట్‌లోని మాస్టర్(రూబీ) బ్యాడ్మింటన్ అకాడమీలో గత నెల 29న ప్రారంభమైన ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ పుల్లూరి సుధాకర్, ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రవీణ్‌కుమార్ హాజరై క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మధు, రూబీ బ్యాడ్మింటన్ అకాడమీ బాధ్యుడు నరసింహస్వామి, కోచ్ సాయినాథ్ పాల్గొన్నారు.

అండగా దోస్త్.. కోర్సులు మస్త్

- కొనసాగుతున్న తొలివిడత ప్రవేశాల ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 13 ప్రభుత్వ, 30కి పైగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు

నిర్మల్‌ఖిల్లా: ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఆఫ్ తెలంగాణ) ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, తదితర కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కళాశాలలన్నీ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నాయి. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సందేహాల నివృత్తికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలని, తప్పుగా నమోదు చేసినట్లు నిర్ధారించుకుంటే హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలని కోరుతున్నారు.

సంప్రదాయ కోర్సులకు డిమాండ్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, దాదాపు 30 వరకు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులోని అన్ని రకాల కోర్సుల్లో కలిపి దాదాపు 18 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. డిగ్రీలో సంప్రదాయ కోర్సులకు ఆదరణ ఎక్కువగా ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొత్తరకం ఉపాధి కోర్సులను కూడా ప్రారంభిస్తోంది.

ప్రవేశాలు మూడు దశల్లో...

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు మూడు విడతల్లో జరగనున్నాయి. మే 6 నుంచి మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రూ.200 రుసుంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 20 నుండి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జూన్ 6న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 7 నుండి 12 వరకు కేటాయించబడిన కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. నిర్దేశించిన తేదీల ప్రకారం రెండవ దశ, మూడవ దశ లో అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది.



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రెండో దశ..

రూ.400 రుసుంతో జూన్ 6 నుంచి 13 వరకు సెకండ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నారు. జూన్ 6 నుంచి 14 వరకు సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 18న రెండో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జూన్ 19 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు.

మూడో దశ..

జూన్ 19 నుంచి 25 వరకు 'దోస్త్' మూడో దశ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.400 రుసుంతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 29న మూడో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జులై 8 నుంచి డిగ్రీ కళాశాలల తరగతులు ప్రారంభమవుతాయి.

మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు..

మొబైల్ యాప్ ద్వారా కూడా దోస్త్ దరఖాస్తు చేసుకోవచ్చని హెల్ప్ డెస్క్ అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్‌ఫోన్లలోని ప్లే స్టోర్ నుంచి డిగ్రీ దోస్త్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో సూచించిన ప్రకారం మొబైల్ నంబర్ ఓటీపీతో వెబ్‌సైట్లోకి ప్రవేశించి సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వెబ్ ఆప్షన్ల తర్వాత ఏ కాలేజీలో సీట్ అలాట్ అయిందో కూడా తెలుసుకోవచ్చు. వెబ్ ఆప్షన్స్ నమోదు సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సమీపంగా ఉన్న వాటిని ముందుగా ఎంచుకుని ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో దూరంగా ఉన్న వాటిని పెట్టుకోవాలని సూచిస్తున్నారు. కోర్సులు కూడా తమకు నచ్చిన వాటిని తొలుత, ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలని కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఎన్నో కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వృత్తి విద్యా కోర్సులతో పాటు సంప్రదాయ డిగ్రీ కోర్సులకు సైతం డిమాండ్ ఉంది. కిందిస్థాయి ఉద్యోగాల నుంచి సివిల్స్ వరకు జరిగే పోటీ పరీక్షలలో డిగ్రీ సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తున్నాయి. డిగ్రీ కనీస అర్హతగా కొనసాగుతోంది. కోర్సును ఎంచుకునే ముందు ఆలోచించి అనుగుణంగా ఉన్న కోర్సును ఎంపిక చేసుకోవాలి. పట్టుదలతో శ్రమించి నైపుణ్యాలు పెంపొందించుకుంటే భవిష్యత్‌లో మంచి రంగంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

– డా.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, దోస్త్ జిల్లా సమన్వయకర్త, నిర్మల్

ప్రకృతి వనాలపై ఉగ్రరూపం

- తాటి, ఈత చెట్లపై నిప్పులు కురిపిస్తున్న భానుడు
- ఎండ తీవ్రతకు మాడిపోతున్న చెట్లు
- కల్లు పారకం తగ్గి ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు



ఎండిపోయి నిర్జీవంగా తాటి చెట్ల కమ్మలు

బెల్లంపల్లి: ప్రకృతి పరంగా అత్యంత సహజ సిద్ధంగా కల్లును అందించే ఈత, తాటి వనాలపై భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఎండ తీవ్రతకు కల్లు పారకం చెట్లు విలవిలలాడుతున్నాయి. ఏపుగా ఎదిగిన చెట్లు కళ్లముందే నిలువున ఎండి పోయి నిర్జీవంగా మారుతుండటంతో వాటిపై ఆధారపడిన గీత వృత్తిదారులు (గౌడ కులస్తులు) ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే అనేక మంది గీత వృత్తిని వదులుకుని ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నారు.

నిలువునా ఎండిపోతూ..

వేసవి తీవ్రత మానవులపైనే కాదు పశుపక్ష్యాదులతోపాటు వృక్షాలపై సైతం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రత గరిష్ఠంగా 42 డిగ్రీల నుంచి 45 డిగ్రీలకు పైగా నమోదవుతోంది. నిప్పుల కుంపటిగా మారుతుండటంతో తాటి, ఈత వనాలు తాళలేకపోతున్నాయి. చెట్టు మొగి (చివరి) భాగం ఎండ తీవ్రతకు మాడిపోతున్నాయి. తాటాకులు పచ్చదనం కోల్పోయి నిర్జీవంగా మారుతున్నాయి. ఈత చెట్ల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. దిన దినం భూగర్భజలాలు అడుగంటి పోతుండటంతో ఈత, తాటి వనాలకు సరిపడినంత నీరు అందడంలేదు.

కల్లు పారకంపై ప్రభావం

మందు వేసవిలోనూ తాటి, ఈత వనాలు కల్లును అందిస్తాయి. ఈ సీజన్‌లో తాటి చెట్లను పండు తాళ్లు అని సంబోధిస్తారు. ప్రకృతి తాటిచెట్లకు ముంజలు, ఈత చెట్లకు పండ్లను ప్రసాదిస్తుంది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో చెట్ల నుంచి కల్లు పారకం తగ్గుముఖం పడుతోంది. దశాబ్దకాలం క్రితం వరకు ఎండాకాలంలోనూ ఒక్కో తాటి చెట్టు రోజుకు గరిష్ఠంగా 8 లీటర్ల నుంచి 10 లీటర్ల వరకు కల్లు పారగా కొంతకాలం నుంచి ఎండ తీవ్రతకు 3 లీటర్లకు మించి కల్లు పారడం లేదని గీత వృత్తిదారులు వాపోతున్నారు. ఈ పరిణామాల ప్రభావంతో అనేకమంది గీత వృత్తిదారులు ఉపాధి లేక అనాదిగా వస్తున్న గీత వృత్తిని వదులుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. కులవృత్తిపై ఆధారపడిన గీత కా ర్మికుల జీవనోపాధిని పెంపొందించడానికి ప్రభుత్వం తగి న సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు.

జిల్లాలో వనాల సంతతి

తాటి, ఈత వనాలు జిల్లా నలుమూలల వ్యాపించి ఉన్నాయి. జిల్లాలో 18 మండలాలు ఉండగా వీటి పరిధిలో 1,76,891 ఈత చెట్లు , 37,016 తాటి చెట్లు ఉండగా 2,016 మంది గీత వృత్తి దారులు జీవనోపాధి పొందుతున్నట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.